# పీడ — నీడ

● ధనికొండ హనుమంతరావు

గోపాలం ఇచ్చిన రిపోర్టు చదువుతున్నంతసేపూ ప్రిన్సిపాల్ రామానందం మనసులోని భావాలు కలగాపులగాలైనవి. ఎలాగో నిభాయించుకొని "ఐతే ఇదంతా నిజమేనా?" అన్నాడు రామానందం.

"నేను కళ్లారా చూశాను సార్!" అన్నాడు గోపాలం నిశ్చయాన్ని సూచించే కంఠస్వరంతో.

"సరే నేను విచారిస్తాను. ఇంతకూ ఈ విషయం నువ్వు ఎవరికీ చెప్పలేదు కదా?"

"లేదు సార్!"

"చెప్పకు. గురువులు కూడా మనుషులే కనుక తప్పులు చేయరని అనలేము. ఐతే గురువుల్ని అవమానించి కాలేజి పరువు ప్రతిష్ఠలను మంటగలపటం తగనిపని. అంతా సరిదిద్దుదాం. నీవు మాత్రం ఈ విషయం బైటికి రానీకు" అన్నాడు రామానందం.

"అలాగే సార్" అని గోపాలం వెళ్లిపోయాడు.

'మంచి విద్యార్థి' అనుకున్నాడు రామానందం.



ఆ రాత్రి రామానందానికి నిద్రపట్టలేదు. మూడేళ్ల క్రితం ప్రమోషన్‌మీద ప్రిన్సిపాలై జీతం మూడొందలు పెరిగినందుకు ఆ మొదటి రోజు మాత్రమే సంతోషించాడు. ఎంతో అధికారం వున్నదనుకున్న రామానందం ఈ చదరంగంలో తానొక పావునని త్వరలోనే గ్రహించాడు.

నరాలు తెగేటంత టెన్షన్‌లో తాను ఇంటికి తిరిగిరాని రోజుకానీ, పీడకలలవలె వెంటాడి వేధించే అనేక సమస్యల వొత్తిడితో కంటినిండా నిద్రలేని రాత్రి కానీ క్రమం తప్పకుండా అనుసరిస్తూనే వున్నవి.

గంటగంటకూ ఏదో ఒక గొడవ. ఏ విద్యార్థిని ఏమన్నా నేరమే! సమ్మె బెదిరింపులు; చీటికీ మాటికీ ప్రదర్శనలు. ఒకటా? భగభగమండే గాడిపొయ్యి మీద కూర్చున్నట్లుగా తయారైంది ఆ కుర్చీ!

పిల్ల గొడవ వొస్తే వేరే నరకం అక్కర్లేదు. రాజకీయ నాయకులు మొదలూ అధికారుల దాకా ఆ మాటకొస్తే మంత్రులు కూడా జోక్యం చేసుకోవడంతో తాను నిమిత్తమాత్రుడై ఎన్ని అన్యాయాలకూ, అక్రమాలకూ పాల్పడవలసి వచ్చిందో తలుచుకుంటే కంపరం పుడుతుంది. తనకొక వ్యక్తిత్వం వున్నదని కానీ, మనస్సాక్షి వున్నదని కానీ పొరపాటున కూడా అనుకోవలసిన పని లేదు!

లెక్చరర్‌గా వున్నప్పుడు, క్లాసులు అయిపోగానే 'చల్ మోహనరంగా!' అనే ధోరణిలో కొంపజేరేవాడు. ఇప్పుడో ఎంత బరువు మోసుకొని రావాల్సి వొస్తోందో ఎవరికి ఎరుక? పైకి అందరూ నమస్కారాలు చేసి గౌరవం చూపేవాళ్లే!

ఈ పైన వచ్చే నెలకు మూడొందల రూపాయిలు తాను అనుభవించే ఈ నరక బాధకు నష్ట పరిహారమా? అక్కర్లేదు. మళ్లీ లెక్చరర్‌గా వేస్తే బాగుండు! ఐతే అది కుదరదు.

ఇవాళ గోపాలం ఇచ్చిన ఫిర్యాదు రామానందాన్ని మరీ కలవర పెట్టింది! ఆ దృశ్యాన్ని మనసులో

ఒకప్పుడు తెలుగుపాఠక లోకాన్ని ఊపేసిన చలం తర్వాత పాఠకుల మీద ప్రభావం చూపిన కిందటి తరం రచయితలలో శ్రీ ధనికొండ హనుమంతరావు ప్రముఖులు, ప్రసిద్ధులు.

ఈ సందర్భంగా ఆయన వ్రాసిన కొత్తకథను 'కొత్తతరం పాఠకులకు' అందజేయడం సముచితంగా వుంటుందని భావిస్తున్నాము.

ఎడిటర్

చ్రితించుకుంటూ కోపంతో ఊగిపోయాడు.

లెక్చరర్ల గది చిమ్మేందుకు వెళ్లిన గంగిని గది చిమ్ముతూండగా లెక్కా్ల లెక్చరర్ శర్మ వెనగ్గా వెళ్లి ఆమె మీదికి వొంగి, అది ఒక్క మెలిక తిరిగి నిలబడటం, శర్మదాన్ని ముద్దాడటం, ఇంతలో ఇదంతా చూస్తున్న గోపాలాన్ని గమనించి, ఎలెక్ట్రిక్ షాక్ తగిలినట్లు గంగిని వొదిలేసి ఏమీ ఎరగనట్లు కూర్చోవటం - ఏమిటి ఇదంతా! ముగ్గురు బిడ్డల తండ్రి లెక్చరర్‌గా గౌరవనీయమైన ఉద్యోగం చేసుకుంటున్న వాడికి ఇదేం పొయ్యేకాలం? తల తిరిగేట్లు చివాట్లు పెట్టి అపాలజీ రాయించాలనే నిర్ణయానికి వచ్చాడు రామానందం.

## —: 2 :—

ఎన్నిరకాలుగా శర్మను తిట్టాలో ఆలోచించు కుంటూ రోజూ కన్నాపావుగంట ముందే రామానందం తన గదికి చేరుకున్నాడు. శర్మకు కబురు చేస్తే అతను ఇంకా రాలేదని తెలిసింది.

ఇంతలో కొబ్బరి ఈనెల చీపురుతో గంగారత్నం ఉరఫ్ గంగి ప్రిన్సిపాల్‌గారి గదిలోకి వొచ్చి ఫేన్ ఆపి చిమ్మటం మొదలు పెట్టింది.

ఇదివరకు కూడా రామానందం ఆమెను చూశాడు కాని, శర్మ మూర్ఛపడేటంత విలాసాలు, విన్యాసాలు, శారీరక ఆకర్షణలు ఎప్పుడూ తోచలేదు.

ఆమె వొంగి చిమ్ముతుంటే - పమిట వొదులై బిగువుగా, బింకంగా, పొందికగా వున్న వక్షం రామానందానికి నయనానందకరంగా కనిపించింది.

ఎప్పుడూ చలించని ప్రిన్సిపాల్‌గారి మనసు పెనుగాలిలో ఎండుటాకల్లే కొట్టుకోసాగింది. ముందువెనుకలు ఆలోచించే అవకాశం లేదు; చేయదగునా తగదా అనే వివక్ష లేదు.

హై వోల్టేజి కరెంటు అరికాళ్లలోంచి ఉవ్వెత్తుగా లేచి ప్రిన్సిపాల్‌గారి మెదడుదాకా ప్రవహించింది. ఏదో అదృశ్యశక్తి నడిపించింది; ఏమీ అర్థంకాని అయోమయంలో తన ప్రయత్నం లేకుండానే లేచి నిలబడ్డాడు రామానందం. గాలిలో తేలిపోతున్న విధంగా వెళ్లి గంగి మీదికి వొంగి ఆమెను గాఢంగా హత్తుకున్నాడు. ఆ స్పర్శలో అసలు మతే పోయినట్లయింది. గంగి చీపురు కింద పడేసి ఒక్క మెలిక తిరిగి విటారుగా నిలబడి ప్రిన్సిపాల్‌గారికి అభిముఖంగా స్థానం మార్చింది. ఆకాశవుటంచుల్లో విహరిస్తున్న ప్రిన్సిపాల్‌గారు గంగిని బిగియార కౌగిలించి ముద్దాడబోతూండగా "గుడ్ మార్నింగ్ సార్!" అన్న లెక్చరర్ శర్మ కంఠస్వరం విని దెబ్బకు నేల వ్రాలినట్లయి తత్తరపడి ఆమెను వొదిలి తన కుర్చీలో కూర్చొని ఆ ఉద్రేకం తాలూకు వేగాన్ని క్రమంగా తగ్గించుకుంటూ ముఖానికి పట్టిన చెమట తుడుచుకున్నాడు. నిన్న స్టాఫ్ రూంలో జరిగిన చరిత్ర ఈనాడు ప్రిన్సిపాల్‌గారి గదిలో పునరావృతమైంది.

మెదడుకు పాకిన కరెంటు శర్మ హెచ్చరికతో గుండెల దాకా దిగింది; ఆ తరువాత గుండె కొట్టుకునే వేగం తగ్గుతుండగా మోకాళ్ళ దాకా దిగింది. ఏమీ జరగనట్టుగానే గంగి చిమ్మటం పూర్తి చేసి ఫాన్ ఫుల్ స్పీడ్‌లో వేసింది.

"రమ్మన్నారట!" అన్నాడు శర్మ.

టెస్ట్‌మ్యాచ్‌లో సెంచరీ కొట్టిన బాట్స్‌మన్ బ్యాట్ ఎత్తి విజయసూచన చేసిన విధంగా గంగి కొబ్బరీనెల చీపుర్ని గాలిలోకి ఎత్తి వయ్యారంగా నడుచుకుంటూ వెళ్లింది.

ఇప్పుడెట్లా? సంభాషణ ఎలా ఆరంభించాలి? ఎలా తిట్టాలో ఆలోచించుకొన్న రామానందం అదంతా మరిచిపొయ్యాడు.

"రమ్మన్నారట!" అని శర్మ మళ్లీ హెచ్చరించాడు.

తను శర్మ కన్నా ఏ విధంగా మిన్న?

సౌమ్యమైన కంఠ స్వరంతో "శర్మగారూ!" గోపాలం అనే విద్యార్థి మీమీద రిపోర్టు చేశాడు. అదేమంత పెద్ద విషయం కాదులెండి. అనవసరంగా రభసచేసి కాలేజీ పేరు పాడుచెయ్యొద్దని సర్దిచెప్పేశాను!" అన్నాడు రామానందం.

> ## వేడితే నీరు
>
> ఒకసారి రామలింగారెడ్డిగారు నెల్లూరు వచ్చారు. ఆయనతో పాటు పానుగంటి రామారాయణింగారు కూడా వున్నారు. నెల్లూర్లో గోడల మీద "వేడి తేనీరు ఆరోగ్యమునకు మంచిది" అని ఎక్కడ బడితే అక్కడ వ్రాసి యుండడం రెడ్డిగారు చూశారు. వెంటనే ఆయన రామారాయణింగారితో
>
> "ఏమయ్యా! ఈ యూళ్లో వేడితే గాని నీరివ్వరా? అది ఆరోగ్యానికి మంచిదట" అని చమత్కారంగా అన్నారు.
>
> — ఎన్. గురుప్రసాదరావు

శర్మ తనలో తనే నవ్వుకున్నాడు. ఇంత సాదాసీదాగా హాయిగా సాగిపోయినందుకు సంతోషించాడు.

శర్మ సెలవు తీసుకుని వెళ్లిపోయాక శర్మకు ముట్టజెప్ప దలిచిన మంగళహారతులు మంత్రపుష్పాలు జ్ఞాపకానికి వచ్చి వాటిని తనకు తానే అప్పగించుకొని రకరకాల తిట్లతో తనను తాను కించ పరుచుకున్నాడు రామానందం.

ఆర్తాతి మరింత ఆందోళనతో గడిపాడు రామానందం. శర్మ చేసింది ఘోరమైన తప్పని తెలిసిన తను కూడా అదే తప్పు చేశాడు. అనుభవం నేర్పిన పాఠాన్ని ఎలా మరిచిపోయాడు.

ఇది ఇంతటితో అంతమౌతుందా అనే ప్రశ్న రేకెత్తింది. ఎంత వింత పరిణామాలకు దారితీస్తుందో తలుచుకుంటేనే కంపరమెత్తుతోంది.

## 3

గంగారత్నం దర్శనమౌతుందేమోనన్న భయంతో మర్నాడు రామానందం కాస్త ఆలస్యంగానే తన గదిలోకి వెళ్ళబోతుండగా, ఆమె గది చిమ్మి వెళ్ళిపోతూ కనిపించింది. తల ఎత్తి చూసేందుకు మనస్కరించక గదిలోకి వెళ్ళి ఫ్యాన్ వేసుకొని కూర్చున్నాడు.

"ఇదుగో ప్రిన్సిపాలయ్యోయ్!"

గంగారత్నం కంఠస్వరం పిడుగుపాటువలె విని పించి రామానందం ముఖం పైకెత్తాడు.

"ఏమిటి గంగారత్నం?" అని ఎంతో మృదువుగా అడిగాడు. 'గంగి' అని పిలిచే అధికారం నిన్నటితోనే పోయింది.

"నాకు ఈ నెల నుంచీ రెండొందలు జీతం పెంచాలి!" అని తన హక్కుకు ఉక్కులాంటి కంఠ స్వరాన్ని జోడించింది.

అదిరిపడ్డాడు రామానందం.

"అదెట్లా? స్టాఫ్‌రూము, ఆఫీసు రూములు చిమ్మేందుకు ఇప్పుడు నీకు మూడొందలు ఇస్తున్నారు కదా! క్లాసు రూమ్‌లు చిమ్మేందుకు వేరే మనుషులున్నారు. ఇంకా రెండొందలు పెంచేందుకు రూల్స్ ఒప్పుకోవు!" అన్నాడు రామానందం సమాధానపరిచే ధోరణిలో.

"ఏంది? రూల్సా? మీరూ, అయ్యవార్లూ వేలకు వేలు తీసుకొని పందికొక్కుల్లా మెక్కుతూంటే, రూల్స్ అడ్డం రాలేదా? ఈ కరవు కాలంలో మరో రెండొందలు జీతం పెంచమని అడిగితే నాకు మాత్రం రూల్స్ అడ్డమా? పాచిపని చేసుకునేందుకు వచ్చిన ఆడకూతురి చెయ్యి పట్టుకొనేందుకు రూల్స్ ఒప్పుకున్నయ్యా..." గంగారత్నం కంఠస్వరం పెరుగుతోంది. ఉద్రేకం కూడా తోడయితే వేరే లౌడ్ స్పీకర్ అక్కర్లేదు.

రామానందం చుట్టుపక్కల కలయజూసి, అప్పటికి ఆ ప్రాంతంలో ఎవ్వరూ లేకపోవడం కేవలం తన అదృష్టంగా భావించి "గంగారత్నం! దయచేసి అరవకు. రెండు రోజులు గడువివ్వు ..." అన్నాడు ప్రాధేయపడే ధోరణిలో.

"ఆడదానికి ప్రాణంకన్నా కూడా మానం...!" అంటోంది గంగారత్నం.

"గంగారత్నం! నా కింకేమీ చెప్పక్కర్లేదు. ఎలాగైనా మేలు చేసే ప్రయత్నం చేస్తాను. దయచేసి అల్లరి చేయకు!"

గంగారత్నం కొబ్బరీనెల చీపురు పతాకంలా గాలిలోకి ఎగరేసి, పమిట ఎగరేసి, నడుము చుట్టూ తిప్పి బొడ్డు దగ్గర మడిచి హుందాగా, దర్జాగా నడిచి వెళ్ళింది.

సముద్రంలో అనేక నదులు, ప్రవాహాలు ఒకదాన్నొకటి ఒరుసుకుంటూ అల్లకల్లోలం చేసిన విధంగా రామానందం మెదడులో అనేక తలపులు ఒకదానితో మరొకటి పోటీపడి కుతకుత లాడించినవి. చాలా సేపటిక్కాని ఆ గందరగోళం నుంచి బైటపడ లేకపోయాడు.

ఎంతో స్ట్రిక్ట్‌గా వుంటూ ఉక్కు మనిషనే పేరు పడ్డ రామానందం బూరుగుదూదల్లే మెత్తబడి పోయాడు.

## 4

రామానందం ఆ రాత్రంతా దీర్ఘంగా ఆలోచిం

వాడు. గంగారత్నం గిగనపేములు వేరితే తాను అధఃపాతాళానికి కుంగిపోయిన సంగతి తేటతెల్లంగానే వున్నది. ఈ గంగారత్నానిది న్యాయమైన కోర్కా, కాదా? అనే ప్రశ్న లేదు. ఆమె నోటికి తాళం వేయకుంటే కొంపలు కూలుతవి. ఆ పరిణామాలను తలచుకుంటే కాళ్ళకింది భూమి బద్దలై ఆ సొరంగంలోకి జారిపోతున్నట్టే అనిపిస్తోంది.

ముగ్గురు బిడ్డల తండ్రి ఈ శర్మ మనస్సు ఎందుకు చలించాలి? చలించేనుపో - సంస్కారం అడ్డుకోలేదేమి? పశువల్లే ఆమె మీదికి దూకనేం? దూకెనుపో గంగారత్నం చీపురుతో సింగారించక పోనేం? నిటారుగా నిలబడి సవాల్ చేసినట్టు కవ్వించనేల? అయినప్పటికీ ఈ శర్మగాడు దాన్ని ముద్దాడనేల? ముద్దాడెనుపో ఈ గోపాలంగాడు చూడనేల? చూసెనుపో - తన కెందుకు రిపోర్టివ్వవలె? ఇచ్చెనుపో - శర్మకు శాపనార్థాలు పెడదామనుకున్న తనకు గంగారత్నం అందచందాలు చూడాలనిపించనేల? చూసీ చూడగానే మనసు పెరపెరలాడనేల? ఆ తరువాత అదే వృత్తం వలయం తిరిగింది - ఈ 'ఏం'కు అర్థమేమిటి?

జరిగింది జరగకుండా చేయగలగడం ఎవరికీ సాధ్యపడదు. జరగవలసిందేమిటి? తెల్లవారుఝాముదాకా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాడు రామానందం.

కళ్ళు మూసుకుంటే నిద్ర ముంచుకు వస్తుందేమోనని భయపడి మొహం కడుక్కొని హోటల్లో కాఫీ తాగి సూర్యోదయం కాకుండానే శర్మ ఇంటికి వెళ్ళాడు రామానందం.

శర్మను వెంటబెట్టుకొని పబ్లిక్ పార్కులో జన సంచారం లేని తావులో కూర్చొని రామానందం తన — పరిష్కార సామగ్రిని విప్పాడు.

జరిగిందంతా వివరించాడు. తరువాత గంగారత్నం నెలకు రెండొందలు అధికంగా ఇవ్వాలని డిమాండ్ చేసిన విషయం చెప్పాడు.

"ముందు ఆ గంగిని డిస్మిస్ చేయండి!" అన్నాడు శర్మ.

"ఆమె తలుచుకుంటే ఈపాటికి మనిద్దర్నీ డిస్మిస్ చేయించగలిగేది! అంతవరకే అయితే ఉద్యోగాలు పోయినా పరువు మర్యాదలతో బయటపడి చావు తప్పి కన్ను లొట్టపోయినట్టు భావించవచ్చు. ఆమె గోల చేస్తే మనిద్దరి బుర్రలూ గొరిగించి, సున్నపు బొట్లు పెట్టి గాడిదల మీద ఊరేగించగల సమర్థులు మన విద్యార్థులు. మతిపోయిన మాటల వల్ల లాభం లేదు. బ్యాలెన్స్ తప్పామో ఎక్కడ పడతామో తెలియదు. ఆ గంగారత్నం అన్నట్టు 'గంగి' అని పొరపాటున కూడా అనకు. శ్రీమతి గంగారత్నం అను. ఆమె నలుగురిలో గోల చేయకముందే సరిచేసుకోవడం మేలు!"

"ఆమె చెప్పగానే సరా? సాక్ష్యాధారాలు అక్కర్లేదా?"

"నీ మీద గోపాలం సాక్ష్యం వుంది. నా మీద నీ సాక్ష్యం వుంది. బొత్తిగా ఒంటరిగా గాడిద మీద ఊరేగకుండా నువ్వు నన్ను తోడు తీసుకోవా?" అన్నాడు రామానందం.

"అయితే, ఏం చేద్దామంటారు?" అన్నాడు శర్మ కాస్త మెత్తబడిన ధోరణిలో.

"ఈమె డిమాండ్‌ను కమిటీలో పెట్టేందుకు వీల్లేదు. వాళ్ళు ఒప్పుకోరు సరికదా ఆమె పట్ల మనమేదో అభిమానం చూపుతున్నామంటారు. రకరకాల కథలు అల్లేందుకు అదో అవకాశమవుతుంది. ఆమెను చూసి మిగతా సేవక బృందం కూడా తమ జీతాలు పెంచమని డిమాండ్ చేయవచ్చు. పెంచకుంటే స్ట్రయిక్. ఎవరి రూమ్స్‌ను వాళ్ళే చిమ్ముకోవలసిన దుస్థితి దాపురించవచ్చు. తీగ లాగితే కంపంతా కదులుతుంది" అన్నాడు రామానందం.

"మరేమిటి పరిష్కారం?"

"జరిగిన అత్యాచారానికి శిక్షగా నోరు మూసుకొని నెల నెలా ఆమెకు రెండొందలు ముట్టచెప్పడమే ఉభయులకూ రక్షణ. చెరో వంద జరిమానా కింద నెల నెలా సమర్పించుకుందాం" అన్నాడు రామానందం.

డబ్బు ప్రమేయం వస్తే మూర్ఖులు కూడా విజ్ఞులవుతారనే సిద్ధాంతాన్ని అనుసరించి "ఏమిటి - లంచమా? అయినా ఆమె మిమ్మల్నే అడిగింది. ఈ చిక్కులోంచి బయటపడాల్సింది మీరు. ఇందులో నన్ను ఇరికించకండి!" అన్నాడు శర్మ.

రామనాథానికి అరికాలి మంట నెత్తికెక్కింది.

"అట్లాగా? న్యాయం ఆలోచిస్తే ఆ మొత్తం ఇచ్చుకోవలసింది నువ్వే!"

"ఏం ఎందుకని?"

"ఈ గేమ్‌ను ప్రారంభించింది నువ్వు. నువ్వా పని చెయ్యకుండా వుంటే నేనీ ఊబిలోకి ఉరికేవాణ్ణి కాదు..."

"ఏం చెయ్యమంటారు? ఆమె పమిట జారి టెన్నిస్ బాల్స్ లాగున్న..."

"షటప్... నీకు ఇంకా బుద్ధి రాలేదేమయ్యా? రెండు టెన్నిస్ బాల్స్ కొనుక్కుంటే యీ లంపటం తప్పేది!" అన్నాడు రామనాథం. "గోపాలం రిపోర్టు రాకుంటే నేను చలించేవాణ్ణా? ఈమెలో వున్న ఆకర్షణ ఏమిటనే మీమాంస వలలో పడ్డాను. ఐనా అగ్గిలాటి ఆడదాని జోలికి...

"అగ్గిలాటి ఆడదా! ఎవరూ ఆ గంగా? మీకు మతి పోతోంది..." అన్నాడు శర్మ.

"ఆమె శ్రీమతి గంగారత్నం అగ్గిలాటి ఆడది కనుకనే బుగ్గికావాల్సిన మనం అదృష్టవశాత్తూ చావు తప్పి కన్ను లొట్టపోయినట్టు ఒళ్ళు కొంచెం కాలింది. నిజంగా నిప్పులో కాలినట్లయితే కొంతలో కొంతన్నా నయం చేసుకోగలిగేవాళ్ళం. ఇప్పుడు కాలింది వుందే ఇది జన్మంతా వెంటాడేట్లున్నది. ఐనా అపరాధాలకు జరిమానాలు చెల్లించాల్సిందే. అనుభవం ఎంత ఖరీదైనా అక్కడికి అదే వాక అని తృప్తిపడక తప్పదు" అన్నాడు రామనాథం.

"మీరు ఏమన్నా చేసుకోండి. నేనేమీ ఇవ్వను" అన్నాడు శర్మ మొండికెత్తినట్టు.

"ఇయ్యవా? అదీ చూస్తాను. కాలికి ఐంది నెత్తికి రాచుకోకుండా తప్పించుకునే ఉపాయం చెపితే నీకు వెగటయిందా? నీకు శ్రీమతి గంగారత్నం భర్తను గూర్చి తెలియదు. అతని పేరు రత్తయ్య. వీధి పోరాటంలో అభిమన్యుడు పద్మవ్యూహంలోకి దూసుకుపోయిన విధంగా ధైర్యసాహసాలు ప్రదర్శించగలడు. ఒకటి రెండు లీటర్ల కాపు సారా తాగాడా యీ సిటీని అట్టుడికించినట్టు ఉడికించగలడు. గళ్ల లుంగీ

## చిలకమర్తి హాస్యోక్తులు:

ఆధునిక యుగంలో వెలసిన మంచి కవి, నాటక కర్త, నవలా రచయిత, ఒక్క మాటలో చెప్పాలంటే బహుముఖ ప్రజ్ఞాశాలి చిలకమర్తి లక్ష్మీ నరసింహం పంతులుగారు. ఆ మహనీయుడి రచనలలో నుంచి కొన్ని మంచి హాస్య రస గుళికలను పాఠకులకు అందించాలన్న ఉద్దేశంతో వారి రచనల నుంచి కొన్ని హాస్యోక్తులని ఏరి వారం వారం మీ ముందుంచుతున్నాము.

### బ్రహ్మలిపి

ఒకప్పుడు ఒక గొప్ప ఉద్యోగి పల్లకి ఎక్కి తన ఊరినుంచి ఇంకొక ఊరికి పోతుండగా దారిలో ఒక శ్మశానం తగిలింది. అందులో ఒక పుర్రె అతని కంట బడింది. ఆ ఉద్యోగికి బ్రహ్మలిపి తెలుగు మానవుల నుదుటమీద బ్రహ్మదేవుడు ఏది రాస్తాడో దాన్ని అంతటిని మామూలు అక్షరాలను చదివినట్టు చదవగలడు. అందు చేత అతడు ఆ పుర్రెను తెప్పించి చదవడం ప్రారంభించాడు. 'ఈ మనుష్యుడు చిట్టచివరకు బ్రహ్మలోకము చేరును' అని ఆ పుర్రెమీద వ్రాయబడి వుంది. అది చదివిన ఉద్యోగి చాలా ఆశ్చర్యపడ్డాడు. 'ఈ మనుష్యుడు బ్రహ్మలోకం చేరాలని వ్రాసి యుండగా ఇది ఈ వల్లకాటిలో ఎందుకు దొర్లుతున్నది? బ్రహ్మదేవుడు పొరపాటున తప్పు వ్రాసివుంటాడు' అను కొని ఆ పుర్రెను బ్రహ్మలోకం తీసుకు పోయి, దానిని బ్రహ్మదేవుడి ముందు పడేసి 'ఏమయ్యా బ్రహ్మదేవుడా! నీవేదో తెలివిగలవాడివనుకున్నాను. నీ వ్రాత ఒకటి, జరుగుతున్నదొకటి! ఈ మానవుడు బ్రహ్మలోకం చేరుతాడని వ్రాశావే! నీ వ్రాతకే తిరుగుంటే ఇక మానవుల వ్రాతలకు లెక్కేమిటి?' అని గట్టిగా అడిగాడు. ఆ మాటలు విని బ్రహ్మదేవుడు చిరునవ్వు నవ్వి అతనితో ఇలా అన్నాడు. 'నేను వ్రాసినదంతా నిజం. ఈ మానవుడు బ్రహ్మలోకం చేరుతాడని నేను వ్రాశాను కదా! నీవు తెచ్చిపెట్టడంవల్ల ఇప్పుడిది బ్రహ్మలోకం చేరలేదా? సంగతి, సందర్భాలు తెలుసుకోకుండా ఇలా మాట్లాడవచ్చునా?' అనగానే ఆ ఉద్యోగి సిగ్గుపడి వెళ్ళిపోయాడు.



సేకరణ: పి.జగన్నాథరావు

మీద ఒరిచేతి వెడల్పు తోలు బెల్ట్ బిగించి దానిలో రెండు మూడు రకాల పదునైన కత్తులు పెట్టుకుంటాడు. చారల బనీను, మెడలో నెక్ టైని బోరివట్టు ఒక పెద్ద జేబు రుమాలును మడిచి వేళ్లాడేస్తాడు. భయంకరమైన మొహం; అంతకన్నా భయంకరమైన టూత్ బ్రష్ మీసాలు, మొత్తంమీద ముళ్ల పంది మాదిరి వుండడం వల్ల ప్రజలు అతని దర్శన మాత్రానే భయభ్రాంతులవుతారు. ఈ రత్తయ్య ఇంటి పేరేమో కాని; కత్తుల్ని ధరించటం వల్ల, కత్తుల రత్తయ్య నామధేయుడయ్యాడు.

‘‘ఇప్పుడా సోదంతా దేనికి?’’ అన్నాడు శర్మ విసుక్కుంటూ.

‘‘ఎందుకా? విను నేను చూపిన పరిష్కార మార్గాన్ని శ్రీమతి గంగా రత్నానికి వివరించి, నువ్వు కలిసిరావడం లేదని విన్నవించుకుంటే, న్యాయ బుద్ధిగల ఆమె నీ ఇంటి ఎడ్రస్ తీసుకొని మొగుడిచేత ఒక సారా బుడ్డి పట్టించి, కొబ్బరి ఈనెల చీపుర్ని గాలిలో తిప్పుకుంటూ ముందు శ్రీమతి గంగారత్నము, వెనుక కత్తుల రత్తయ్య నీ ఇంటి మీదికి దాడిచేస్తే, మిగతాది ఆలోచించుకో. ఇరుగు పొరుగులకు చాలా వినోదమే కావొచ్చు. నీ విషాదం సంగతి ఊహించు. శ్రీమతి గంగారత్నం చీపురు సింగారం, కత్తుల రత్తయ్య రక్తాభిషేకం...ఎలాగూ అనుభవిస్తావు కనుక నేను వివరించనక్కర్లేదు. ఈ కత్తుల రత్తయ్య మీద ఖూనీ కేసు కూడా నిలవదు. రాజకీయ నాయకులకు అతని అండ అవసరం. వాళ్లే అతన్ని బైట పడేస్తారు. ఇంత వివరంగా ఎలా చెప్పగలుగుతున్నా నంటే ఈ కత్తుల రత్తయ్య దివ్యమంగళ విగ్రహం ఒకసారి పేపర్లో పడితే చూశాను. అతని చరిత్ర అంటావా జగద్విఖ్యాతం!... బాగా ఆలోచించుకో...’’

‘‘పోనీ జరిగిందానికి క్షమాపణ చెప్పకో?’’

‘‘ఆ మాటకొస్తే ఆమె జవాబు రెండే రెండు అక్షరాలు’’

‘‘ఏమిటవి?’’

‘‘పో బే!’’

‘‘బేరం పెడదాం’’ అన్నాడు శర్మ.

‘‘ఆమెతో వాదప్రతివాదాలు చేస్తావా? ఓపిక వుంటే చెయ్. దూముడిగా వున్నదాన్ని ఎందుకు పీట ముడి వేసుకుంటావు?’’

‘‘ఇలా ఎన్నాళ్లీ పరిహారం?’’

‘‘ఏమో ఎవరు చెప్పగలరు? ఆమె దయ మన ప్రాప్తం. రేపు ఆమెకు దుర్బుద్ధి పుట్టి అపరాధపు మొత్తాన్ని పెంచితే ఏం చేస్తాం? పై మెట్టు జారాము. ఎక్కడిదాకా పడతామో తెలియదు. యీ పీడ నీడ జాడ ఏడ? ఏమో! అంతా అయోమయం! సరే... ఇంతకూ ఏమంటావ్?’’ అన్నాడు రామనాథం.

‘‘అనేందుకు ఏముంది? అంతా దేవి కటాక్షం. నా వంతుగా నేను రెండునూరు అర్పించుకుంటాను. ఈ విషయం నివురుగప్పి వుంచండి. ప్రజ్వరిల్లిందో మిగిలేది మన బూడిదే!’’ అన్నాడు శర్మ.

ఉభయులకూ జ్ఞానోదయమైంది. అప్పట్నుంచి ప్రతి నెలా రెండో తారీకున శ్రీమతి గంగారత్నానికి రెండు వందల రూపాయిల నోట్లు ముట్టుతూనే ఉన్నవి.

ఆమె గది చిమ్ముతుండగా, రెండో తారీకు ఉదయం చుట్టుపక్కల ఎవరూ లేకుండా చూసి రెండు వంద రూపాయిల నోట్లున్న కవరును ప్రిన్సిపాల్ రంగనాథం కింద పడెయ్యటం, శ్రీమతి గంగా రత్నం చిరు నవ్వులు చిందిస్తూ ఆ కవరును జాకెట్టు మధ్యకు నెట్టడం, ఆ తరువాత విజయ చిహ్నంగా కొబ్బరీనెల చీపురు గాలిలోకి ఎగరేసి, ఠీవిగా హుందాగా నడచివెళ్లటం మామూలైంది.

శ్రీమతి గంగారత్నం గది చిమ్ముతూన్నప్పుడు శర్మ కానీ, రామనాథం కానీ ఆ గదిలోంచి బైటికి వెళ్లి, ఆమె వెళ్లిపొయ్యాక గదుల్లోకి వెళ్లటం కొత్త ఆచారం.

ప్రతి నెలా రెండో తారీకున ఆ కవరు ఆమెకు అందించి, యీ దృశ్యం ఎవరికంటా పడకుండా కాపాడుకోగలిగాక ఆ నెలకు ‘బతుకు జీవుడా’! అని ఉస్సూరుమనటం తనకు పట్టిన ‘కర్మ’ అని రామనాథం సరిపెట్టుకుంటూ ఉంటాడు.

*


నాజూకు తనానికి నైజం
నవనాగరికతా రూపం - క్వీన్ బ్రా
సహజాకృతికి, సుఖానుభూతికి - క్వీన్ బ్రా
అన్నిషాపులలో లభిస్తోంది - క్వీన్ బ్రా

QUEEN BRA



క్వీన్ బ్రా

MANUFACTURERS:
QUEEN ENTERPRISES
41, ANDERSON STREET
MADRAS-600 001

VEEYES